# స్మృతులు వదలవు

దాసరి శిరీష కథలకు సాధారణంగా ఆధునిక యువతి సాంసారిక జీవితంలోనూ, ఇంటి వెలుపలి జీవితంలోనూ ఎదుర్కొనే సమస్యలే ఇతివృత్తాలు.

మెళ్ళో గొలుసూ, గాజులూ అవీ జాగర్త. వద్దన్నా ఒక్క దానివే బయల్దేరావ్.'' రఘు మాటల్లో నగం నిష్ఠురం, నగం బాధ ధ్వనించాయి.

''ఏం ఫర్వాలేదండీ. రాత్రి తొమ్మిది లోపే వెళ్ళిపోతాగా'' అంది తార పొడిగా.

''మీ మావయ్యకి రాజమండ్రి వాళ్ళ గురించి చెప్పడం మర్చిపోకు.''

''మర్చిపోను.''

''తొందరగా వచ్చెయ్యి. మళ్ళీ నెక్స్ట్ వీకంతా నాకు క్యాంప్- తెలుసుగా!''

''రావడానికే ప్రయత్నిస్తాను.''

''అదిగో బస్సు స్టార్టవుతోంది. వస్తాను మరి. జాగర్త. వెళ్ళగానే ఫోన్ చేయించు. లేదా లెటర్...''

అతని మాటలు నగం గాల్లో కలిసిపోయాయి. తార అసంతృప్తిగా నిట్టూర్చి వెనక్కి ఆనుకోబోయి ఆశ్చర్యంగా చూసింది. ఒక ముప్పయ్యేళ్ళ యువకుడు హడావుడిగా చెయ్యి అడ్డం పెట్టి బస్సు స్లో కాగానే మెరుపులా బస్సెక్కడం, పైన సూట్‌కేస్ సర్దుతూ ఉండగా చేతిలో ఇంకో సూట్‌కేస్ జారిపడడం, తార గబాల్న పట్టుకుని అందివ్వడం వరసగా జరిగిపోయాయి.


ఆ నవ్వెంత చక్కగా ఉంది! తార మళ్లీ ఆ నవ్వుమొహాన్ని తలచుకుని అప్రయత్నంగా వెనక్కు తిరిగింది. ఈ లోపల అతనూ సీట్లో జారగిలబడి రిలీఫ్‌గా నిట్టూర్చాడు. వెనక్కు తిరిగిన తార వైపు అనుకోకుండా కృతజ్ఞతగా చూశాడు. పెదిమలు మర్యాదగా సాగి ముడుచుకున్నాయి.

సీటు వెనక మోచెయ్యి ఆనించిన తార అంత తొందరగా ముందుకు తిరగలేకపోయింది.

''మేడం, జల్లు కొడుతోంది. ఆ గ్లాస్ మూసేద్దామా?'' అతను మృదువుగా అన్నాడు.

మంత్రముగ్ధలా తలూపి కొంచెం ఇవతలికి జరిగింది. అతనే బలంగా గ్లాసుని నెట్టి ''ఇప్పుడు ఫర్వాలేదనుకుంటా. ఎక్కడ వరకూ మేడమ్!'' అన్నాడు ఎంతో మర్యాదగా.

జవాబు చెప్పి తన సీట్లో సరిగ్గా సర్దుకుని కూర్చుంది.



ఎందుకో ఉదయం నించీ మనసు బరువుగా, అదోరకంగా ఉంది. ఏ నాటివో జ్ఞాపకాలు తరుము కొస్తూ ఎన్నెన్నో దృశ్యాలు సినిమా రీళ్ళలా కళ్ళ ముందు తిరుగుతున్నాయి. ప్రయాణం వల్ల ఓ రకంగా ఎంతో విశ్రాంతి దొరకినట్లు అయింది. ఆరు గంటల సేపు తనిష్టమొచ్చినట్లు స్వేచ్ఛగా ఆలోచించుకోవచ్చు.

బస్సు డ్రైవర్ వీడియో ఆన్ చేశాడు. ఏదో సినిమా. డ్యూయెట్ గీతాలూ, ఆ సంగీతం చాలా గందర గోళంగా అనిపిస్తున్నాయి. తారకి సన్నగా తలనొప్పి మొదలయింది. చుట్టూ అందరివైపూ చూసింది.

కొంత మంది అర్ధ నిమీలిత నేత్రాలతో చూస్తున్నారు. ఇంకొంత మంది పగలయినా నిద్ర పోవడం ధర్మం అనుకుంటూ ఒకవైపుకి ఒరిగారు. మరి కొంతమంది మాత్రమే లేని ఉత్సాహాన్ని తెచ్చిపెట్టుకుని చూస్తున్నారు.

ఈ శబ్దాన్నీ ఆ దృశ్యాలనీ భరించడం ఎంత నరకం?

తార కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి. ఆ వ్యక్తి లేచి డ్రైవర్ దగ్గర కెళ్ళి ఏం చెప్పాడో వెంటనే వీడియో ఆగిపోయింది. అతను వచ్చి మళ్ళీ తన సీట్లో కూచున్నాక ఆ నిమిషంలో అతను తనలాంటి వాళ్ళ కెంత మేలు చేశాడోగదా అనిపించింది.

మనిషిలాగానే అతని అభిరుచులూ చాలా గొప్పగా ఉన్నాయి. ఎంత చక్కగా రిక్వెస్ట్ చేసుండక పోతే ఆ డ్రైవర్ అంత వెంటనే బుద్ధిగా ఆపు చేస్తాడు.

గ్లాస్ లోంచి అస్పష్టంగా వర్షపు ధారలు కనిపిస్తు న్నాయి. దూరంగా బోర్డర్‌లా ఉన్న కొండల వరస మీద కురుస్తున్న వర్షం అద్భుతమైన చిత్రంలా కనిపిస్తూ మనస్సుని చాలా వెనక్కి తీసుకెడుతూ గొప్ప అనుభూతిని ఇస్తోంది.

ఈ ప్రయాణం... ఈ ఆలోచనల్లో ఇంత స్వేచ్ఛ, తననెవరూ ఏమాత్రం డిస్టర్బ్ చేయని ఈ ఏకాంతం చాలా బాగున్నాయి. తనకంటూ సొంతంగా కొంత సమయాన్ని కేటాయించుకోలేని మనిషి జీవితంలో ఎన్నెన్ని అమూల్యమైనవి పోగొట్టుకుంటు న్నాడో బాగా తెలుస్తోంది ఈ చిన్న పులకింతలోనే.

వర్షం కాస్త తక్కువగా పడుతున్న ప్రాంతాల్లో అగ్ని పూల చెట్లు ఎఱ్ఱగా, పచ్చగా విరగబూసి మనోహరంగా కనిపిస్తున్నాయి.

చిన్నప్పుడు చెట్లన్నా రకరకాల మొక్కలన్నా ఎంత ప్రేమ!

జీవితంలో ఓ దశలో ఏదీ చేయడానికి వీలుకాని పరిస్థితుల్లో ఇష్టాలన్నీ అయిష్టాలుగా మారుతుంటాయి. అదీ అశక్తత వల్ల కలిగే అయిష్టత. అంతే.

ఇంత ఆహ్లాదకరమైన ప్రయాణం గురించి ఎన్నెన్ని సర్దుబాట్లు? ప్రతి క్షణం తన కనుసన్నలలో మెలగా లన్నట్లు ప్రవర్తించే భర్త రఘు అదంతా ప్రేమే అనుకోమంటాడు. ఒకరోజు పొద్దున్నే కాఫీ ఇవ్వలేక పోయినా, జ్వరం వచ్చి వేళకి అతనికీ, పిల్లలకీ అన్నీ అమర్చలేకపోయినా చిందులు తొక్కుతూ ఇల్లంతా గందరగోళం చేస్తూ ''అమ్మో, నువ్విలా మంచంలో ఉంటే నాకు పిచ్చెక్కుతుంది. నాకేమీ తోచదు'' అనే అతని మాటల్లో, అతనే కాదు పిల్లల మాటల్లో కూడా ప్రేమకన్నా స్వార్థమే ఎక్కువ కనిపిస్తుంది.

తప్పు పూర్తిగా తనదే. ఆ తర్వాత సౌందర్యాన్వేషణకు, స్పందనకు, అనుభూతికి ఏమాత్రం అవకాశం లేని సంసారంలో ఇరుక్కుపోయింది.

ఆ ప్రేమకి మూల్యం ఇంకో రూపంలో... అంటే ఓ కొత్త వస్తువే, నగో, చీరో... ఈ రూపంలో మాత్రమే అతను చెల్లించగలడు. పాపం, మానవుడు. జాలని పిస్తుంది తనకు. అదేం కర్మో స్పందన అంటే అర్థం తెలియకుండా పోయింది. ఆనాడు రమేష్ తన మనస్సుని వశపరుచుకుని నిర్జీవంగా వదిలేశాడు. తప్పు పూర్తిగా తనదే.

ఆ తర్వాత సౌందర్యాన్వేషణకు, స్పందనకు, అనుభూతికి ఏమాత్రం అవకాశం లేని సంసారంలో ఇరుక్కుపోయింది.

బాధ్యతలు నిర్వర్తిస్తే సంతృప్తి కలుగుతుందేమో కానీ స్పందన కలగదు.

రమేష్‌తో జీవితాంతం అద్భుతంగా బ్రతకగలిగేది అనే గ్యారంటీ ఏమీ లేదు. కానీ కొంతకాలమన్నా పూర్తి వివశత్వంతో, సహజత్వంతో మనిషిలాగా బ్రతికేది.

బస్సు కుదుపుకి ఉలిక్కిపడింది తార. వర్షం పూర్తిగా తగ్గిపోయింది. 'అతను లేచి గ్లాస్ అతని వైపు లాగాడు. చల్లగాలి అతి సున్నితంగా ముంగురులను పలకరించింది. గాలి ఇంత ఉత్తేజాన్ని ఇవ్వగలదని ఇప్పుడే తెలిసినట్లు అనిపిస్తోంది తారకి. ఎందుకో తనలో కలుగుతున్న చిన్న అనుభూతులకూ, ఆనందాలకూ పరోక్షంగా ఆ వెనక సీట్లో వ్యక్తి కారకుడవుతున్నాడు.

రమేష్‌ని తలచుకుంటూ విషాదంగా నిట్టూరుస్తూనే ఏదో వింత ఆనందానికి గురవుతోంది.

బహుశా చాలా అరుదుగా దొరికిన ఈ ప్రయివసీ వల్ల వస్తున్న ప్రశాంతతేమో!

జుత్తు సవరించుకుని కిటికీ లోంచి ఊరు చూసింది తార. ఓ హెూటల్‌కి కాస్త దూరంగా ఆగింది బస్సు. కాఫీ, టీ, సోడా కేకలు, అందులోనే కలిసిపోయిన చామంతి పూలు...చామంతి పూలు అనే అరుపులు... జంతికలు... బిస్కట్స్... అన్ని రకాల కేకలు... ఆ హడావుడి తన ఆలోచనలకి విఘ్నం కలిగించడం లేదు.

అనలిక్కడ ఈ బస్సులో తన గొడవ ఎవరికీ పట్టదు. తన జోలి కెవరూ రారు. ఈ ఊహే చాలా బాగుంది. ఊహ వాస్తవరూపం దాల్చడం వల్ల తనకెంతో ఇష్టమైన గతం, ఏనాటివో అస్పష్టమైన జ్ఞాపకాలూ విజృంభించి మనస్సుని అల్లరి పెడుతున్నాయి.

బస్సు మళ్ళీ పరుగందుకుంది. వెనక సీట్లో వ్యక్తి ఏదో మేగజైన్ మూసేసిన చప్పుడు.

ఎవరి ప్రశ్నలకో మెల్లగా మృదువుగా బదులిస్తున్నాడు.

ఈ కాస్త అబ్జర్వేషన్‌లో అతనికి మంచి అభిరుచులు ఉండొచ్చనిపిస్తోంది తనకి, అభిరుచులూ... మంచితనం అన్నీ కలిసి మృదువైన భాషని నేర్పిస్తాయి. కానీ, అందరి విషయంలో ఇది నిజం కాకపోవచ్చు.

అతన్ని చూస్తుంటే...ఇంకా మంచి జ్ఞాపకాలు రేగుతున్నాయి. మంచి జ్ఞాపకాలు వస్తున్నందువల్ల అతనంటే వింత ఆకర్షణ మొదలయింది. ఎందుకు కోరి కోరి మనస్సుని ఇలా బాధించుకుంటోంది?

తారకు తనమీద తనకే కోపం వచ్చింది. ఎందుకింత మీమాంస? తన మనస్సు... తనిష్టం... బయటకు చెప్పడానికి వీల్లేనన్ని ఊహలు ప్రతి మనిషికీ వస్తుంటాయి. అందువల్ల ఎవరికీ నష్టం లేదే? ఎవరికీ అన్యాయం జరగట్లేదే?

కళ్ళు తుడుచుకుంది తార. చాలా మందికి జీవితం యవ్వనం తొలిదశలోనే హఠాత్తుగా ఆగిపోతుంది. యవ్వనం కన్నా ప్రేమకన్నా ఆకర్షణకన్నా ఇంకేవో చాలా గొప్ప విషయాలున్నట్లు పెళ్ళి చేసేస్తారు. బిగిస్తారు.

పైలట్ ఆఫీసర్‌గా ఎక్కడికో ఏదో ట్రెయినింగ్‌కి వెళ్ళిన రమేష్ రాకముందే తనకి బలవంతంగా పెళ్ళి చేసేశారు. అసలు అందుబాటులో లేని వ్యక్తి గురించి ఏమాత్రం ప్రతిఘటించలేని పరిస్థితి అది. అంతకన్నా చొరవగా దూసుకుపోయి వ్యవహారాన్ని చక్కపెట్టడానికి అనువైన వయసు కాదు. అంత సన్నిహితులైన మిత్రులు కూడా లేరు. అయినా, వాళ్ళకీ చిన్నతనం. రమేష్ తిరిగొచ్చాక ఎంత షాక్ తింటాడో, దిగ్భ్రాంతికి గురవుతాడో తెలును తనకు.

మూడు ముళ్ళూ వేయించుకుంది. కుటుంబ వ్యవస్థ తనని ప్రేమ కోసం నిలబడనీయలేదు. తన ఉదాసీనతని సిగ్గుగా భావించి సరిపెట్టుకున్నాడు పాపం రఘు. అతనితో ఏం సమస్య లేదు. సమస్యల్లా తన మనస్సే.



చాలామందికి జీవితం యవ్వనపు తొలిదశలోనే హఠాత్తుగా ఆగిపోతుంది... ఇంకేదో గొప్ప విషయాలున్నట్లు పెళ్ళి చేస్తారు. బిగించేస్తారు.

పెళ్ళయిన పది రోజులకు రఘు వెళ్ళిపోయాక లైబ్రరీ వైపు వెడుతుంటే తనకెంతో...

తారకి కన్నీళ్ళు చెంపల మీదికి జారాయి. విండోకి తలానించి కళ్ళు మూసుకుంది బాధగా.

ఆదేమిటో ఎప్పుడూ ఆ దృశ్యమే కలలోకి వస్తుంది. కరెంట్ పోయిన సినిమాలోలా అసంపూర్తిగా ఉంటుంది కలలో ఆ దృశ్యం. ఇప్పటికీ ఏడుస్తూ అవన్నీ జ్ఞాపకం చేసుకోవడం తనకెంతో ప్రియమైన వ్యాపకం.

లైబ్రరీ సందు మలుపు తిరిగాక ఆ కార్నర్‌లో చిన్న డాబా ముందు వరండాలో నిలబడి పిలుస్తున్నాడు రమేష్.

''ఏమిటీ'' అంది వణకుతూ.

''లోపలకి రా''.

''పనుంది వెళ్ళాలి.''

''ఏమిటంత కొత్తగా మాటాడుతున్నావు? వెళ్ళి పోదువు గానిలే. రా తారా.''

''ఇంకోసారి వస్తాను.''

''రెండేళ్ళయింది మనం కలుసుకుని. కనీసం నువ్వు ఫోన్ కూడా చెయ్యలేదు.''

తనకేమీ అర్థం కాలేదు. ఇదేమీ సిటీకాదు. రమేష్ ఇంటికీ, తనింటికీ మధ్య రెండు కిలోమీటర్ల కన్నా దూరం లేదు. ఏం జరిగిందో అతనికి తెలియకుండానే ఉందా?

''చూడు, వర్షం రాబోతోంది. ముందు లోపలకి రా'' ప్రేమగా కసిరాడు. గబుక్కున వరండా ఎక్కింది. రమేష్ దీక్షగా చూస్తూ కూచోమన్నట్లు సోఫా చూపించాడు. తను తల దించుకుంది. తలెత్తాలంటే భయం. ఈ పరిస్థితి చాలా దుర్భరంగా, దుఃఖపూరితంగా ఉంది. అయినా, రమేష్‌ని చూడడం వల్ల సహజమైన విషయమేదో జరిగినట్లు హృదయం పురి విప్పింది. ఈ బంధువులూ, ఈ పెళ్లీ, ఈ హడావుడీ - ఇదంతా అనవసర ఆర్భాటపు సంఘటనలా, ఏదీ తనకు సంబంధించిన విషయం కాదన్నట్లు తమాషాగా ఉంది.

హఠాత్తుగా రమేష్ రెండు భుజాలూ పట్టుకుని లేవదీసి గాఢంగా హృదయానికి హత్తుకున్నాడు. తను విదిలించబోయేసరికి మరింత గాఢంగా కౌగలించుకున్నాడు.

''ర...మే...ష్.''

''ఊఁ.''

''ర...మే...ష్.''

''చెప్పు తారా.'' తల నిమురుతూ గడ్డం పైకెత్తి కళ్ళలోకి చూశాడు. అతని చేతివేళ్ళు కళ్ళు తుడిచాయి. అతని కళ్ళు చాలా ప్రేమగా వెలుగుతున్నాయి. ఇంత

ప్రశాంతంగా ఎలా ఉన్నాడు? ఇతనికేమీ తెలియదా?

మెల్లగా కౌగిలి విడిపించుకోబోయింది. అతను వదలకుండా నవ్వుతూ "పెళ్ళయింది కాబట్టి ఇంత నిషేధమా" అన్నాడు.

అంతే...దుఃఖం ఎగదన్నుకొచ్చింది. ఎప్పుడు రమేష్ ఒళ్ళో చేరిందో తెలియదు. అంతా విన్నాక "పిచ్చీ! ఎంత తల్లడిల్లిపోయి ఉంటావ్!" అన్నాడు నిట్టూర్చి.

"నామీద కోపం లేదూ?"

"అసల్లేదు. ఏం చేయగలవు ఆ పరిస్థితుల్లో... నేనర్థం చేసుకోగలను."

హృదయం ఉప్పొంగింది ఆ మాటలకు. అనుకోకుండా అతని నుదురు ముద్దు పెట్టుకుంది.

"గుడ్." అతను నవ్వి రహస్యంగా "మరి నేనూ" అన్నాడు చెవిలో.

జ్ఞానోదయం అయినట్లు తుళ్ళిపడి లేచి కూచుంది. తనకేమయింది? నిన్నటివరకూ రఘు పక్కలో పడుకుని ఇప్పుడిలా... ఛా...ఛా...

"ఏం ఫర్వాలేదు. అతన్ని కలిసి చెప్పుమంటే నేనే చెబుతాను. లేదా నువ్వే లెటర్ రాసెయ్యి. నిన్నిదివరకే పెళ్ళి చేసుకునుంటే ఇలా జరిగేది కాదు."

"ఏం మాటాడుతున్నావ్!"

"ఈ జీవితం మనిద్దరిదీ. చిన్న యాక్సిడెంట్... అదీ నేను ఊళ్ళో లేకపోవడం వల్ల జరిగింది. ఈ చిన్న పొరపాటుకు ఇద్దరం తెలివితక్కువగా జీవితాలను బలిపెట్టుకోవద్దు. నీకేమీ జ్ఞాపకం రానంత దూరం నిన్ను తీసుకెళ్ళిపోయి...... అసలు వర్రీ కాకు - ఒంటరిగా నువ్వేం చేయలేవు రెండ్రోజుల్లో ఫ్లయిట్‌కి టికెట్స్ బుక్ చేస్తాను..."

"రమేష్. ఏమిటీ నువ్వు మాటాడేది?"

"ఆఖరికి నా ఉద్యోగం పోయినా సరే... ఏది పోయినా తిరిగి సంపాదించుకోగలను కానీ, నిన్ను ఇప్పుడు.... ఇలా వదులుకుంటే మాత్రం... అయినా, ఈ సంప్రదాయాల మీదా, వాగ్దానపు పునాదుల మీదా ఆధారపడలేదు మన ప్రేమ..."

ఆ విలక్షణత, మనుష్యులు మహా సీరియస్‌గా భావించే కొన్ని విలువల పట్ల అతని నిర్లక్ష్యం తనని ముగ్ధురాల్ని చేశాయి. ఈ నాటికీ, ఆ నాటికీ పులకరిస్తుంది. అటువంటి మగవాణ్ణి చూడలేదనిపిస్తుంది.

మళ్ళీ బస్సు కుదుపుకి కళ్ళు తెరిచింది. కాఫీ తాగాలనిపిస్తోంది. అటూ ఇటూ చూసింది.

"మేడమ్, ఈ కాఫీ తీసుకోండి."

తార ఆశ్చర్యంగా చూస్తూ కాఫీ అందుకుంది. ఆ చిరునవ్వుకి మనస్సు అదుపు తప్పుతోంది. ఇదేమిటో రమేష్ ప్రేమని తలచుకుంటూ ఇతన్ని చూసి కలవరపడుతోంది. ఏదో సిమిలారిటీ ఈ వ్యథలో.

ఎంత చక్కని మూమెంట్స్? ఎంత మాన్లీనెస్? ఇతనితో పరిచయం పెంచుకోవాలనిపిస్తోంది.

తార పర్సు తీయబోతుంటే అతను నవ్వుతూ వారించి గ్లాసందుకుని కిటికీలోంచి కుర్రాడికి అందించాడు.

"మీరెక్కడివరకూ!" తడబడుతూ అడిగింది.



హృదయం ఉప్పొంగింది ఆ మాటలకు. అనుకోకుండా అతని నుదురు ముద్దు పెట్టుకుంది. జ్ఞానోదయం అయినట్లు తుళ్ళిపడి లేచి కూచుంది.

"నేనూ హైదరాబాద్. మీది ఏ ఏరియా?"

"నేనూ అక్కడికే. చాలాకాలం తర్వాత ఒంటరిగా ప్రయాణం చేస్తున్నాను." అప్రయత్నంగా అనేసి ఛా ఛా ఇలా ఎందుకన్నానా అనుకుంటూ "ఒక్కదాన్నే ఎప్పుడూ వెళ్ళలేదు" అంది సంజాయిషీగా.

"ఫర్వాలేదు మీ రూట్ చెబితే మిమ్మల్ని ఆటో ఎక్కించాకే నేను వెడతాను."

"థాంక్యూ."

తల బలవంతంగా ముందుకు తిప్పుకుంది. అసలు రమేష్ తప్ప ఇంకే పురుషుడూ తనని ఆకర్షించలేదు అనుకుంది. ఇదేమిటీ? తనెందుకిలా ఊరికే డిస్టర్బ్ అయిపోతోంది? ఇతనిలో ఎక్కడో కొద్దిగా రమేష్ పోలికలున్నాయి. ఆ మానరిజమ్, ఆ మాట తీరూ, ఆ నమ్రతా, చూపుల్లో స్థిరత్వం రమేష్‌ని బాగా గుర్తుకు తెస్తున్నాయి. అందుకేనేమో తను మరీ...

అతనిది పక్కసీటయినా బాగుండేది. మాటిమాటికీ వెనక్కి తిరిగితే బాగుండదుగా?

అసలేం కావాలి? ఏమిటీ ఆరాటం?

నిత్యం కలిసుండడం వల్ల, రఘు అంటే ప్రేమ రావడం లేదా?

అది పూర్తిగా నిజం కాదేమో? రమేష్ ప్రేమ గాయాన్ని మాన్చుకోవడం కోసం రఘు వైపు మనస్సు డైవర్ట్ చేయబోయింది. నిజాయితీగా ప్రేమించబోయింది. ఊహూఁ - సాధ్యం కాలేదు. అసలు సాధ్యం కాలేదు.

భావ వైరుధ్యం.

ఎంత ప్రేమని నేర్పాలని చూసినా, ఆ తియ్యదనాన్ని చవిచూపించాలని ప్రయత్నించినా రఘు ప్రాక్టికాలిటీ ముందు అన్నీ కూలిపోయాయి. ఏకాంతంలో కానీ, పడకటింట్లో కానీ అతను డబ్బు గురించో, తాతగారి వాటాల పంపకం గురించో, కెరియర్ గురించో మాటాడడం మినహా తన భావుకత, ప్రేమ అర్థం చేసుకునే స్థాయిలో ఏమాత్రం ఉండడని అర్థమై ఆ ప్రయత్నాన్ని విరమించుకుంది. అయినా ప్రేమపట్ల ఆ జిజ్ఞాసా, గౌరవం తనకీనాటికీ తగ్గలేదు. తియ్యటి భ్రమే కావచ్చు.

కానీ, ఆ మాధుర్యపు ధ్వని ఎంత గొప్పది? రమేష్ ప్రేమదృక్కులూ... ఆ కౌగిలింతలో ఆవేదన... ఆర్తి... ఆ మృదువైన స్పర్శా ఈ నాటికీ... తనని...

అవును. ఎప్పుడూ అక్కడవరకే వచ్చి తన ఊహలు ఆగిపోతాయి. జీవితం అలా ఎందుకయింది?

రమేష్ చెప్పిన మాటలకు కన్విన్స్ అయి ఇంటికి వచ్చింది. వీళ్ళందర్నీ ఎలా వదులుకోవాలా, రెండ్రోజుల్లోనే ఇంత పెద్ద నిర్ణయం ఎలా తీసుకోవాలా అని మథనపడుతుండగా ఆ రాత్రే రఘు వచ్చేశాడు. కొత్త పెళ్లాన్ని వదల్లేకపోతున్నాడంటూ అందరూ హాస్యమాడారు. రఘు తనకు తోచిన విధంగా ప్రేమనీ, మోజునీ చూపించి ఆ మర్నాడు తార లేందే వెళ్ళి ఉద్యోగం చేయలేననీ, తారని వెంటనే తీసుకెళ్ళిపోతాననీ అత్తమామలతో చెప్పాడు. వాళ్ళు వెంటనే కాపురానికి పంపే సన్నాహాలు ప్రారంభించారు.

అంతే. ప్రేమ ఓడిపోయింది. తను పిరికిదా? ఏమో? వెంటనే పరిగెత్తుకొచ్చిన రఘు తనతో ఉండగానే రమేష్‌తో దూరతీరాలకు సాగిపోవడం తనకి సాధ్యం కాలేదు.

అంతే. రమేష్‌తో ఒక్కమాట అయినా చెప్పకుండా రఘుతో కలిసి వైజాగ్ వెళ్ళిపోయింది.

ప్రేమికురాలిగా తన జీవితం పరిసమాప్తి. ఇల్లాలిగా, పిల్లల తల్లిగా ఇంకో జీవితం ఆరంభం..

వెనక సీట్లో హమ్మింగ్ వినిపిస్తోంది. ఏదో హిందీ పాట. ఆ హమ్మింగ్ కూడా ఎంతో హాయిగా..

తార అంత బాధలోనూ తనని తాను చూసుకుని నవ్వుకుంది.

ఇంకో గంట వరకూ అలా స్వేచ్ఛగా ఆలోచించుకుంటూనే ఉంది.

హైదరాబాద్ వచ్చేసింది. దిల్‌షుక్ నగర్‌లో బస్సు ఆగింది. తార లేవబోతుంటే మోకాలు కలుక్కుమంది. "అబ్బా" అంది బాధగా.

"మామ్మగారూ, ఇవి నేను పట్టుకొస్తాను. మీరు మెల్లగా లేవండి." తార ప్రయత్నం చూసి అతను చెయ్యి అందించాడు.

తార అరవయ్యేళ్ళ వయోభారంతో మెల్లగా లేచి నిలబడి అతని చెయ్యి వదిలేసింది. ●